సాక్షి
కామారెడ్డి
గురువారం । 17 । ఆగస్టు । 2023



సమ్మె బాటలో..
వైద్య ఆరోగ్య శాఖలో సుమారు రెండు దశాబ్దాలుగా కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న ఏఎన్ఎంలు సమ్మె బాట పట్టారు.
- 8లో ▸



అడవులు కాపాడాలంటూ..
అడవులను కాపాడాలని డిమాండ్ చేస్తూ పేట్ సంగెం గ్రామస్తులు అటవీ శాఖ క్షేత్రాధికారి కార్యాలయం వద్ద రాస్తారోకో చేశారు.
- 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.8 /23.3
వాతావరణం
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

వైన్‌షాప్‌లకు భారీగా దరఖాస్తులు

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం సాయంత్రం వరకు 944 దరఖాస్తులు నమోదయ్యాయి. బుధవారం ఒక్క రోజే 202 వచ్చాయి. కామారెడ్డి సర్కిల్ పరిధిలో 314, దోమకొండలో 204 దరఖాస్తులు, ఎల్లారెడ్డిలో 130, బాన్సువాడలో 143, బిచ్కుందలో 152 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల దాఖలుకు మరో రెండు రోజులు గడువుంది.

'నవోదయ' ప్రవేశాలకు గడువు పొడిగింపు

నిజాంసాగర్: నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు గడువు పొడిగించారు. ఈనెల 25 వరకు గడువు పొడిగించినట్లు విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జె.యోహానస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పీసీసీ అధ్యక్షుడిపై ఫిర్యాదు



బాన్సువాడ: పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బుధవారం బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఫ్యాక్స్ ద్వారా పంపిన ఫిర్యాదును బీఆర్ఎస్ నాయకులు సీఐ మహేందర్‌రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా పోచారం భాస్కర్‌రెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోలీసులపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం శ్రమించే పోలీసులను అసభ్య పదజాలంతో దూషించడం తగదన్నారు. రేవంత్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు అందించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు పాత బాలకృష్ణ, ఎజాస్, జంగం గంగాధర్, గురు వినయ్, బాబా, వాహబ్, బుల్లెట్ రాజు, గాదం సత్యం, రమేశ్ తదితరులున్నారు.

'ఆధునిక పద్ధతులు అవలంబించాలి'




మద్నూర్: రైతులు ఆధునిక పద్ధతులను అవలంబించి పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని డీఏవో భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఆమె మద్నూర్ శివారులోని సోయాబీన్ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఏటా పంట మార్పిడి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేష్, ఏవో రాజు, ఏఈవోలు ప్రియాంక, అనిల్, శ్రీలేఖ, రైతులు రమేశ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా గణన..

బాన్సువాడ రూరల్: వ్యవసాయ గణనను పకడ్బందీగా చేపట్టాలని డీఏవో భాగ్యలక్ష్మి సూచించారు. బుధవారం తాడ్కోల్ రైతువేదికలో ఏఈవోలతో సమావేశమయ్యారు. ఐదేళ్లకోసారి వ్యవసాయ గణన నిర్వహించాల్సి ఉండగా చివరిసారిగా 2015–16లో చేపట్టారన్నారు. కరోనా కారణంగా 2021–22లో గణన వాయిదా పడిందన్నారు. క్షేత్రస్థాయిలో 10 అంశాలపై వివరాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ కమల కిషన్, ఏవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ సర్వే పరిశీలన



సదాశివనగర్: ఉత్తునూర్ పీహెచ్‌సీ పరిధిలో ఇటీవల చేపట్టిన లెప్రసీ సర్వే తీరును బుధవారం డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోతె సాయవ్వ రాములు, ఎంపీటీసీ రాంచందర్‌రావు, నాయకులు వడ్ల సుధాకర్‌చారి, శ్రీకాంత్‌రావు, రాజు, స్టాఫ్‌నర్సు మమత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రేణుల్లో ఆందోళన.. 'గంప'లో ధీమా!

- మూడు నియోజకవర్గాలలో సిట్టింగ్‌లకే మరో అవకాశం
- స్పష్టం చేసిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్
- కామారెడ్డిపై రాని స్పష్టత
- తనకే టికెట్టు వస్తుందన్న నమ్మకంలో గంప గోవర్ధన్
- కేడర్‌కు భరోసా ఇస్తున్న ప్రభుత్వ విప్
- కోనాపూర్ సభతో స్పష్టత వచ్చే అవకాశం



బాన్సువాడలో తిరిగి పోచారం శ్రీనివాస్‌రెడ్డే బరిలో ఉంటారని సీఎం కేసీఆర్ తేల్చేయగా.. పక్కనున్న జుక్కల్‌లోనూ సిట్టింగ్ ఎమ్మెల్యే హన్మంత్ సింధేనే మరోసారి గెలిపించాలని మంత్రి కేటీఆర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇటీవల ఎల్లారెడ్డిలో పర్యటించిన మంత్రి కేటీఆర్.. జాజాల సురేందర్‌ను బంపర్ మెజారిటీతో మరోసారి అసెంబ్లీకి పంపాలని ప్రజలను కోరారు. ఇలా జిల్లాలోని మిగతా మూడుచోట్ల అధికార పార్టీ నుంచి బరిలో నిలిచేది ఎవరో తేల్చేసిన బీఆర్ఎస్ అధిష్టానం.. కామారెడ్డిపై మాత్రం ప్రకటన చేయకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే అనుచరుల్లో ఆందోళన నెలకొంది. అయితే కామారెడ్డి టికెట్టు తనదేనన్న నమ్మకంతో ఉన్న గంప గోవర్ధన్.. తన అనుచరుల్లో భరోసా నింపే ప్రయత్నం చేస్తున్నారు.

– సాక్షి, కామారెడ్డి

త్వరలో స్పష్టత..

మంత్రి కేటీఆర్ నాయినమ్మ ఊరైన కోనాపూర్‌లో నిర్మించిన స్కూల్ బిల్డింగ్‌ను త్వరలో ప్రారంభించనున్నారు. కేటీఆర్ విదేశీ పర్యటన తర్వాత కోనాపూర్‌కు వస్తారని, అప్పుడు నియోజక వర్గస్థాయిలో నిర్వహించే సభలో కామారెడ్డి టికెట్టుపై క్లారిటీ వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. సీఎం కేసీఆర్ పోటీ చేసే అవకాశం ఉంటే ఇప్పటికే పెద్ద ఎత్తున నిధులు మంజూరై, పార్టీ నాయకత్వం, అధికార యంత్రాంగం అప్రమత్తం అయ్యేదని అంటున్నారు. అలాంటి పరిస్థితులు కనిపించకపోవడంతో సీఎం ఇక్కడినుంచి పోటీ చేయకపోవచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో టికెట్టు తనకే వస్తుందని గంప సైతం ధీమాతో ఉన్నారు.

త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలలో ఘన విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలని భావిస్తున్న బీఆర్ఎస్ అధిష్టానం.. ఎన్నికలకు పకడ్బందీగా సన్నద్ధమవుతోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులపై సర్వేలు చేయించిన సీఎం కేసీఆర్.. గెలుపుకోసం అవసరమైన చోట అభ్యర్థులను మారుస్తారన్న ప్రచారం జరిగింది. అందులో కామారెడ్డి అసెంబ్లీ స్థానం ఒకటన్న ప్రచారం జరుగుతోంది. దీనికి తోడు కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తారన్న ప్రచారం ఊపందుకుంది. ఇటీవల కామారెడ్డిలో పర్యటించిన మంత్రి కేటీఆర్.. గంప గోవర్ధన్ నేతృత్వంలో కామారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని అభినందించారు. కేటీఆర్ గోవర్ధన్‌ను అభినందించడం కేడర్‌కు కొంత ఉత్సాహాన్నిచ్చినా ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయకపోవడంతో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో స్పందించిన ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గంప గోవర్ధన్.. కామారెడ్డి నుంచి పోటీ చేయాలని తానే సీఎం కేసీఆర్‌ను కోరానన్నారు. కేసీఆర్ పోటీ చేస్తే కామారెడ్డి మరింత అభివృద్ధి చెందుతుందన్న భావనతో తాను సీఎంను ఆహ్వానించానని పేర్కొన్నారు. ఈ అంశంపై రాజకీయంగా చర్చ జరిగింది. గోవర్ధన్ గెలవడని సర్వేలు చెబుతున్నాయని, అందుకే ఓటమి భయంతోనే కేసీఆర్ పేరు తెరపైకి తీసుకువచ్చారంటూ మాజీ మంత్రి షబ్బీర్ అలీ స్పందించారు. కేసీఆర్ పోటీ చేసినా, ఇంకా ఎవరు పోటీ చేసినా తన గెలుపును ఎవరూ ఆపలేరన్న ధీమా వ్యక్తం చేశారు. దీంతో గంప గోవర్ధన్ తన స్వరం పెంచారు. కేసీఆర్ పోటీ చేయకపోతే తానే బరిలో ఉంటానని, షబ్బీర్‌అలీని చిత్తుగా ఓడిస్తానని ప్రకటించారు.

మిగతా నియోజకవర్గాల్లో..

బాన్సువాడలో అధికార పార్టీ అభ్యర్థి ఎవరో సీఎం కేసీఆర్ ఎప్పుడో తేల్చేశారు. బీర్కూర్ మండలంలోని తెలంగాణ తిరుమలను సందర్శించిన సమయంలో మళ్లీ పోచారం శ్రీనివాస్‌రెడ్డినే గెలిపించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. నాగమడుగు ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన అనంతరం పిట్లంలో నిర్వహించిన సభలో పాల్గొన్న మంత్రి కేటీఆర్.. జుక్కల్ ఎమ్మెల్యేగా హన్మంత్ సింధేకు మరో అవకావం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈనెల 14న జిల్లాకు వచ్చిన మంత్రి కేటీఆర్ ఎల్లారెడ్డి పర్యటనలో జాజాల సురేందర్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. ఇలా జిల్లాలోని మూడు నియోజకవర్గాలలో సిట్టింగ్‌లే బరిలో నిలుస్తారన్న స్పష్టత రావడం, కామారెడ్డిపై మాత్రం ప్రకటన చేయకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే అనుచరుల్లో ఒకింత ఆందోళన నెలకొంది. తమ నాయకుడికి టికెట్టు వస్తుందో లేదోనన్న టెన్షన్‌లో వారున్నారు. దీనికి తోడు పలువురు నాయకులు టికెట్టు కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తుండడంతో గంప అనుచరుల్లో ఆందోళన మరింత పెరిగిపోతోంది. దీంతో గంప వారి ఆందోళన తొలగించే ప్రయత్నం చేస్తున్నారు.

మరోసారి గ్యారంటీ అంటూ..

క్యాడర్‌లో నెలకొన్న ఆందోళనకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ప్రయత్నిస్తున్నారు. మొన్నటివరకు టికెట్టు విషయమై మాట్లాడని గోవర్ధన్.. ఇటీవల టికెట్టు తనకే వస్తుందంటూ తనను కలుస్తున్నవారితో పేర్కొంటున్నారు. పోటీ చేయడమే కాదు మరోసారి విజయం సాధిస్తానన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందడానికి ఇక్కడి నుంచి పోటీ చేయమని సీఎం కేసీఆర్‌ను కోరానని, ఆయన పోటీ చేస్తానంటే తాను త్యాగం చేయడానికి రెడీగా ఉన్నానని చెబుతున్నారు. అయితే సీఎం కేసీఆర్ గజ్వేల్ నుంచే పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్న నేపథ్యంలో తనకు టికెట్టు పక్కా అనే ధీమా గోవర్ధన్‌లో కనిపిస్తోంది.

డబ్లింగ్‌కు పచ్చజెండా!



కామారెడ్డి రైల్వే స్టేషన్

- ముఖేడ్ నుంచి డోన్ వరకు..
- నెరవేరనున్న దశాబ్దాల కల

సాక్షి, కామారెడ్డి: రైల్వే డబ్లింగ్ పనులకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. మహారాష్ట్రలోని ముఖేడ్ నుంచి నిజామాబాద్, బాసర, కామారెడ్డి, హైదరాబాద్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని డోన్ వరకు 417.78 కిలోమీటర్ల మేర రైల్వే లైన్‌ను డబుల్ లైన్‌గా మార్చడానికి రూ.4,686 కోట్లు మంజూరు చేస్తూ కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ ప్రాంతవాసుల దశాబ్దాల కల నెరవేరబోతోంది.

ఉత్తర, దక్షిణ భారతాలను కలిపే లైన్..

ఉత్తర, దక్షిణ భారత్‌ల మధ్య కీలకమైన ముఖేడ్ – డోన్ రైల్వే లైన్ సింగిల్ లైన్ కావడంతో రైళ్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ మార్గంలో కామారెడ్డినుంచి ఇటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తోపాటు విజయవాడ, వరంగల్, తిరుపతి, కర్నూలు, కడప, గుంటూరు, విశాఖపట్టణం, నెల్లూరు, గూడురు ప్రాంతాలకు, అటు నిజామాబాద్, బాసర, నాందేడ్, ముఖేడ్, ముంబయి, షిరిడీ తదితర ప్రాంతాలకు పలు రైళ్లు నడుస్తున్నాయి. కామారెడ్డి స్టేషన్ నుంచి నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. సింగిల్ లైన్ కారణంగా క్రాసింగ్‌లతో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీంతో ప్రయాణం గంటలు గంటలు ఆలస్యమవుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డబ్లింగ్ చేస్తేనే ఇబ్బందులు తొలగుతాయని ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. డబ్లింగ్‌తో రైళ్ల సంఖ్యను పెంచడానికి ఉపయోగపడుతుందని రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి. డబ్లింగ్ చేస్తే రాకపోకలకు ఇబ్బందులు తొలగి రైళ్ల వేగం పెరగనుంది. ఇప్పటికే రైల్వే లైన్ విద్యుదీకరణ పూర్తయ్యింది. డబ్లింగ్ కూడా చేపడితే రైల్వే సేవలు మరింత మెరుగుపడనున్నాయి.

రవాణా సౌకర్యం మరింత అందుబాటులోకి..

రైల్వే లైన్ డబ్లింగ్ పనులు పూర్తయితే ఈ ప్రాంతంలో రైళ్ల రాకపోకలు మరింత పెరగనున్నాయి. ఇప్పటికే అటు సికింద్రాబాద్‌కు, ఇటు మహారాష్ట్రకు దాదాపు 55 ట్రైన్లు తిరుగుతున్నాయి. రెండు లైన్లు అయిన తర్వాత రైళ్ల రాకపోకలకు క్రాసింగ్ కష్టాలు తీరుతాయి. ఫలితంగా రైళ్ల వేగం పెరగడంతో పాటు రైళ్ల సంఖ్య కూడా పెరిగే అవకాశాలుంటాయి. తద్వారా రవాణా సౌఖ్యం మెరుగుపడుతుందని భావిస్తున్నారు. డబ్లింగ్‌తో నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, మేడ్చల్, మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ, కర్నూలు, నాందేడ్ జిల్లాలకు ప్రయోజనం కలుగనుంది. ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం రైల్వే డబ్లింగ్ పనులకు నిధులు మంజూరు చేయడంపై వివిధ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

పారిశ్రామిక ప్రగతికి ఊతం..

ముఖేడ్ నుంచి డోన్ దాకా డబ్లింగ్ పనులు పూర్తి చేస్తే ఈ ప్రాంతంలో పారిశ్రామిక ఉత్పత్తుల రవాణాకు మార్గం మరింత మెరుగవుతుంది. ఈ మార్గంలో హైదరాబాద్, నాందేడ్, నిజామాబాద్, మెదక్, కర్నూల్ తదితర జిల్లాల్లో పరిశ్రమలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. రైల్వే లైన్ డబ్లింగ్ అయితే పారిశ్రామిక ఉత్పత్తులను రవాణా చేయడానికి అవకాశాలు మెరుగుపడతాయి. ముఖేడ్, బోధన్, నిజామాబాద్, కామారెడ్డి, జడ్చర్ల, మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాల్లో వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు డబ్లింగ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆయా ప్రాంతాలనుంచి ఏటా లక్షల మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఇంతకాలం సింగిల్ లైన్ మూలంగా రవాణాకు కొంత ఇబ్బందికరంగా ఉండేది. డబ్లింగ్ పనులు చేపడితే ఆయా ఉత్పత్తుల రవాణా సులువు కానుంది.

ఓటరు నమోదుకు స్పెషల్ డ్రైవ్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- ఈనెల 27, 28, వచ్చేనెల 2, 3 తేదీలలో నిర్వహణ
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకోసం ఈనెల 27, 28, సెప్టెంబర్ 2, 3 తేదీలలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఈ అవకాశాన్ని యువత వినియోగించుకునేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 21న ముసాయిదా ఓటర్ల జాబితా, అక్టోబర్ 4న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు ఇదే చివరి అవకాశమని, అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జనాభాలో 5 శాతం మంది 18–19 ఏళ్ల నిండిన వారుంటారని, జిల్లాలో రెండున్నర శాతమే ఓటరుగా నమోదయ్యారని పేర్కొన్నారు. మిగిలినవారు ఓటర్లుగా నమోదయ్యేలా చూసేందుకు కళాశాల స్థాయిలో ఓటరు నమోదుకు జిల్లా యంత్రాంగం స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రతి బూత్ స్థాయిలో తమ ప్రతినిధులను నియమించుకోవాలని, డ్రాఫ్ట్ ఓటరు జాబితాను పరిశీలించి మార్పులు, చేర్పులుంటే చేసుకోవాలని నాయకులకు సూచించారు. చనిపోయిన వారి పేర్లు ఉంటే తొలగించాలని, ఒకే కుటుంబంలోని ఓటర్లు వివిధ పోలింగ్ బూతులలో ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే 1950 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్‌చేయాలన్నారు. కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలతో పాటు మొబైల్ వ్యాన్‌ల ద్వారా మాక్ పోల్ నిర్వహిస్తూ ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వివిధ కారణాలతో కొన్ని పోలింగ్ కేంద్రాల ప్రాంతాలను మార్చామని పేర్కొన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఖాసీం అలీ, నరేందర్, నరేష్ గౌడ్, జఫార్ ఖాన్, తాహెర్, హరిలాల్, వెంకట్ గౌడ్, బాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

స్వీప్ ద్వారా అవగాహన కల్పిస్తున్నాం

కామారెడ్డి క్రైం: జిల్లాలో స్వీప్(సిస్టమాటిక్ వోటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ద్వారా యువ ఓటర్ల నమోదుకు ముమ్మరంగా కార్యక్రమాలు చేపట్టామని కలెక్టర్ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను ఆయన వివరించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత, ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి ఓటు విలువను తెలియజేస్తున్నామన్నారు. ఈనెల 15 వరకు కొత్తగా నమోదైన ఓటర్ల వివరాలను ఎపిక్ కార్డుల ముద్రణ కోసం ఏజెన్సీకి పంపిస్తామన్నారు. ఈనెల 19న ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేస్తామన్నారు. ప్రతివారం రాజకీయ పార్టీలతో సమావేశమవుతున్నామని, ఓట్ ఫర్ షూర్ నినాదంతో అన్ని మున్సిపాలిటీలలో 5 కె రన్ నిర్వహించనున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్ రెడ్డి, ఎన్నికల సూపరింటెండెంట్ అనిల్, డిప్యూటీ తహసీల్దార్ సాయిలు పాల్గొన్నారు.

జాతీయ భావాన్ని పెంపొందించేందుకు..

కామారెడ్డి క్రైం: విద్యార్థుల్లో జాతీయ భావాన్ని పెంపొందించేందుకు ఉచితంగా గాంధీ చిత్రాన్ని ప్రదర్శిస్తున్నట్లు కలెక్టర్ పాటిల్ తెలిపారు. జిల్లాలోని 9 సినిమా హాళ్లలో ఉచితంగా ప్రదర్శిస్తున్న గాంధీ చలన చిత్రాన్ని బుధవారం 25 పాఠశాలలకు చెందిన 5,074 మంది విద్యార్థులు తిలకించారన్నారు. 24 వ తేదీవరకు ప్రభుత్వ పని దినాలలో రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందన్నారు. బుధవారం కామారెడ్డిలోని దర్శన్, ప్రియ 70 ఎంఎం థియేటర్లలో ఎంఈవో ఎల్లయ్య చిత్రాన్ని వీక్షించారు.

విస్తరిస్తున్న గన్ కల్చర్!

- విచ్చలవిడిగా ఎయిర్ గన్‌ల వాడకం
- కాల్పులు జరిగితేనే వెలుగులోకి...
- తల్వార్లు తిప్పుతూ పార్టీలు
- ఆందోళన కలిగిస్తున్న ఉదంతాలు

స్టేటస్ కోసం కొందరు, వన్య ప్రాణుల వేట కోసం మరికొందరు తుపాకులు వాడుతున్నారు. పార్టీల్లో తల్వార్లు సైతం తిప్పేస్తున్నారు. విచ్చలవిడిగా తుపాకులను వాడుతున్నట్లు ఇటీవల జరిగిన సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఉదంతాలు పెరుగుతుండడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం గన్ కల్చర్‌పై నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.

– సాక్షి, కామారెడ్డి

ఇటీవల మద్నూర్ మండల కేంద్రంలో ఓ విందులో తుపాకీతో హల్‌చల్ చేసిన వీడియో వైరల్ కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.


గతేడాది లింగంపేట మండలంలో ఎయిర్‌గన్‌లతో జింకలను వేటాడి వాహనంలో తరలిస్తుండగా పోలీసులు చేజ్ చేసి పట్టుకున్నారు.

లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డిలో మంగళవారం సాయంత్రం ఓ ఫాం హౌస్‌లో తుపాకీ తూటా తగిలి అదే గ్రామానికి చెందిన రాజు అనే యువకుడు గాయపడ్డాడు. అతడి వీపు భాగం నుంచి తూటా లోపలికి వెళ్లింది. ఆపరేషన్ చేసి తొలగించనున్నారు. బుధవారం ఆపరేషన్ చేసి ఎయిర్ గన్ పెల్లెట్ తొలగించారు. ఎయిర్ గన్ వాడకం కూడా చట్ట వ్యతిరేకమైనదే. ఫాంహౌస్‌లో ఉన్న ఎయిర్‌గన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో గన్ కల్చర్ రోజురోజుకు విస్తరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. కొందరు యువకులు గన్ కల్చర్ మీద మోజు పెంచుకుంటున్నారు. చేతిలో గన్ పట్టుకుని హల్చల్ చేయొచ్చని, బెదిరించొచ్చనే భావనతో కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరికొందరు వన్యప్రాణులను వేటాడేందుకు కొనుగోలు చేస్తున్నారు. పొరుగున ఉన్న మహారాష్ట్రలోని వివిధ పట్టణాలకు వెళ్లి ఎయిర్‌గన్‌లు, నాటు తుపాకులు కొనుగోలు చేస్తున్నారు. అలాగే ఆన్‌లైన్‌లో కూడా ఆర్డర్ చేసి తెప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది.

వన్యప్రాణులను వేటాడేందుకు..

పోచారం అభయారణ్యం చుట్టుపక్కల ప్రాంతాల్లో వన్యప్రాణుల సంచారం ఎక్కువ. లింగంపేట, తాడ్వాయి, నాగిరెడ్డిపేట మండలాల పరిధిలోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణులు ఎక్కువగా తిరుగుతుంటాయి. దీంతో చాలామంది వన్యప్రాణుల వేటగాళ్లు ఆ ప్రాంతంలో వేటాడుతున్నారు. గతేడాది జింకలను చంపి వాహనంలో తరలిస్తుండగా అనూహ్యంగా పోలీసుల కంట పడి తప్పించుకోవడానికి యత్నించారు. పోలీసులు వెంటాడి పట్టుకున్న విషయం తెలిసిందే. హైదరాబాద్ నుంచి వన్యప్రాణులను వేటాడేందుకు చాలామంది వాహనాల్లో నాగిరెడ్డిపేట, లింగంపేట మండలాలకు వస్తున్నారు. రాత్రి వేళల్లో వేటాడుతున్నారు. వన్యప్రాణుల వేట కోసం తుపాకులు వాడుతున్నట్టు గతంలో జరిగిన సంఘటనల ద్వారా స్పష్టమైంది. అక్కడి నుంచి వచ్చే వేటగాళ్లకు స్థానికంగా కొందరు సహకరిస్తున్నట్టు తెలుస్తోంది.



స్టేటస్ కోసం..

ఇటీవలి కాలంలో తల్వార్ల కల్చర్ పెరిగింది. స్మార్ట్ ఫోన్లు రాకముందు, వాట్సాప్, ఫేస్ బుక్ లాంటి సోషల్ మీడియా లేనప్పుడు ఎవరి బర్త్ డే ఎప్పుడు ఉంటుందో తెలియకపోయేది. సామాజిక మాధ్యమాల ద్వారా స్నేహితులు, బంధువులతో పాటు నాయకుల బర్త్ డే ఎప్పుడో ఇట్టే తెలిసిపోతోంది. బర్త్ డే వేడుకలను ఘనంగా నిర్వహించి, ఫొటోలు దిగి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసే కల్చర్ పెరిగింది. అయితే చాలాచోట్ల బర్త్‌డే కేక్‌లను తల్వార్‌తో కోయిస్తున్నారు. తల్వార్‌ను చేతితో తిప్పించి ఫొటోలు, వీడియోలు తీసి పోస్ట్ చేస్తున్నారు. చాలామంది స్నేహితులు, లీడర్ల బర్త్ డే వేడుకల సందర్భంగా తల్వార్లను కానుకగా ఇస్తున్నారు. పొరుగున ఉన్న మహారాష్ట్రలోని నాందేడ్‌లో తల్వార్లు లభిస్తాయి. అక్కడికి వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. గన్, తల్వార్ కల్చర్ మరింత పెరిగితే విచ్చలవిడితనం పెరిగి నేరాలు పెరిగే అవకాశం ఉంది. పోలీసు యంత్రాంగం నిఘా పెట్టి చట్ట వ్యతిరేక చర్యలను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

క్లుప్తంగా

పీజీ పరీక్షలు ప్రారంభం



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో పీజీ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పీజీ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షకు 226 మంది విద్యార్థులకు గాను 218 మంది హాజరయ్యారు.పరీక్షా కేంద్రాన్ని ప్రిన్సిపాల్ కవితాతోరన్ పరిశీలించారు.

'చెట్ల పెంపకంతోనూ ఆదాయం'



నిజాంసాగర్: చెట్ల పెంపకం ద్వారా గ్రామ పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవాలని రీజినల్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సత్తయ్య సూచించారు. బుధవారం అచ్చంపేట శివారులో 16 ఎకరాల్లో ఏర్పాటు చేసిన సంపద వృక్షాల పెంపకం పనులను ఆయన పరిశీలించారు. గ్రామ పంచాయతీకి సంపదను ఇచ్చే చెట్లను నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి రమేశ్, ఎంపీడీవో నాగేశ్వర్, పంచాయతీరాజ్ ఏఈ సురేశ్, టెక్నికల్ అసిస్టెంట్లు చంద్రశేఖర్, బాల్‌సింగ్, ప్రభాకర్ తదితరులున్నారు.

పీఎంపీ, ఆర్ఎంపీలను గుర్తించాలి



మాచారెడ్డి(కామారెడ్డి): గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న పీఎంపీ, ఆర్ఎంపీలను ప్రభుత్వం గుర్తించాలని పీఎంపీ ఆర్ఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్. దేవయ్య కోరారు. బుధవారం చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎంపీ, ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, తెలియని వ్యాధులకు చికిత్సలు చేసి ఇబ్బందులు పడవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పీఎంపీ, ఆర్ఎంపీలకు పారా మెడికల్ శిక్షణ ఇచ్చి పల్లె, బస్తీ దవాఖానాల్లో ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, శంకర్, సత్యనారాయణ, దశరథం, సిద్ధిరాములు, చారి, నర్సింలు ఉన్నారు.

సమ్మె బాటలో కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు

- వైద్యశాఖలో విధులు బహిష్కరించిన ఆరోగ్య కార్యకర్తలు
- 20 ఏళ్లుగా పని చేస్తున్నాం.. పరీక్ష మాకెందుకని ప్రశ్న
- ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్



మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరంలో కూర్చున్న ఏఎన్ఎంలు

కామారెడ్డి టౌన్: వైద్య శాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు సమ్మె బాట పట్టారు. విధులను బహిష్కరించి దీక్షలో కూర్చున్నారు. తమకు ఎలాంటి పరీక్ష నిర్వహించకుండా క్రమబద్ధీకరణ చేయాలని, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్‌లను నెరవేర్చాలని పట్టుపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలలో విధులు చేపడుతున్న ఏఎన్ఎంలు బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు సమ్మె ప్రారంభించారు. వారి సమస్యలపై సాక్షి ప్రత్యేక కథనం..

జిల్లాలో 318 కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు

జిల్లా 22 పీహెచ్‌సీలు, ఒక అర్బన్ హెల్త్ సెంటర్, సబ్ సెంటర్‌లలో 318 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఈసీ, సెకండ్ ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో 2003, 2004, 2007 నుంచి అంటే 20 ఏళ్లుగా విధులు చేస్తున్నవారు ఉన్నారు. ఇప్పుడు వీరంతా సమ్మెలో పాల్గొంటున్నారు.

పరీక్ష రాయం.. పర్మినెంట్ చేయండి

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌పీఎస్‌సీ ద్వారా వైద్య శాఖలో 1520 ఏఎన్ఎంలు(ఎంపీహెచ్‌ఏ ఫిమేల్) రెగ్యులర్ పోస్టులకు నోటిఫికేషన్ వేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న వారికి వెయిటేజ్ మార్కులు ఇస్తున్నారు. ఈనెల 25లోపు దరఖాస్తులకు అవకాశం ఇచ్చారు. అయితే ఈ నోటిఫికేషన్ రద్దు చేయాలని, తమకు పరీక్ష రాయకుండానే క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 20 ఏళ్లుగా పని చేస్తున్నామని మళ్లీ అదే పోస్టుకు పరీక్ష రాసి ఉద్యోగంలో చేరటం దారుణమని వాపోతున్నారు. తమను క్రమబద్ధీకరణ చేసి మిగతా పోస్టులకు కొత్త వారికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

గ్రామాల్లో నిలిచిన వైద్యసేవలు

ప్రధానంగా గ్రామాలు, పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లలో వైద్య సేవలు అందిస్తారు. గర్భిణులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, టీబీ, బీపీ, షుగర్, క్షయ, చిన్నపిల్లలకు వ్యాక్సినేషన్, రక్త పరీక్షలు, మందుల పంపిణీ, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, వైద్యశాఖలో సంక్షేమ పథకాలు ఇలా ఎన్నో వైద్య సేవలు అందిస్తున్నారు. అలాగే ట్యాబ్‌లలో ఆన్‌లైన్ వివరాల నమోదు, 14 రకాల రికార్డులు రాయడంలాంటి పనులు చేస్తారు. వీరి సమ్మెతో ఇప్పుడు గ్రామాల్లో సేవలు నిలిచిపోయాయి.

'వెంటనే క్రమబద్ధీకరించాలి'

కామారెడ్డి టౌన్: వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న రెండో ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలని మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్, సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ఏఎన్ఎంల సమ్మె శిబిరాన్ని వారు సందర్శించి, మాట్లాడారు. ఏఎన్ఎంల డిమాండ్లను నెరవేర్చకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంజుల, ప్రతినిధులు రేణుక, సరోజ, అలేఖ్య, జ్యోతి, సుశీల, శిరీష, బాలమణి, కవిత, దీవెన, సుమలత, సులోచన, నాయకులు బాల్‌రాజ్, రాజనర్సు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించే వరకు పోరాటం



20 ఏళ్లుగా ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నాం. ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేయకుండా అన్యాయం చేస్తోంది. రెగ్యులరైజ్ చేసే వరకు పోరాటం చేస్తాం.

– మంజుల, కాంట్రాక్ట్ ఏఎన్ఎంల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

సీఎం మాటమార్చారు



ప్రత్యేక తెలంగాణ వస్తే కాంట్రాక్ట్ వ్యవస్థే ఉండదని, కాంట్రాక్ట్ సీఎంను కూడా పెట్టుకుందామా అని వ్యాఖ్యానించిన కేసీఆర్ ఇప్పుడు తమను అన్యాయం చేశాడు. తక్షణమే కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

– రేణుక, ఏఎన్ఎం, మాచారెడ్డి

20 ఏళ్లుగా చేస్తున్న పనికి పరీక్ష రాయాలా?



20 ఏళ్ల నుంచి చాలా మంది ఏఎన్ఎంలు వైద్య శాఖలో పనులు చేస్తున్నారు. కరోనా సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ఎందరో ప్రాణాలను కాపాడాం. వ్యాక్సినేషన్ చేశాం. ఇప్పుడు అదే పనికి మాకు పరీక్ష రాయమని చెబుతున్నారు.

– బాలమణి, ఏఎన్ఎం, కామారెడ్డి

క్రమబద్ధీకరణ తర్వాతే పరీక్ష పెట్టాలి



మొదట మమ్మల్ని క్రమబద్ధీకరణ చేశాకే టీఎస్‌పీఎస్‌సీ ద్వారా పరీక్ష పెట్టాలి. చాలీచాలనీ వేతనంతో పనిచేస్తున్నాం. అయినా మమ్మల్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. క్రమబద్ధీకరణ చేసేంత వరకు ఉద్యమం చేస్తాం. మాకు ప్రభుత్వం న్యాయం చేయాలి. – సరోజ, ఏఎన్ఎం, దేవునిపల్లి

యువకుడి ఆత్మహత్యాయత్నం



కామారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రదీప్ యాదవ్

భిక్కనూరు : మండల కేంద్రంలో ఒక యువకుడు బుధవారం ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. భిక్కనూరు పట్టణానికి చెందిన ప్రదీప్ యాదవ్ కుటుంబ సమస్యలతో సతమతమవుతూ జీవితంపై విరక్తి చెంది ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీన్ని గమనించిన కుటుంబీకులు వెంటనే ప్రదీప్ యాదవ్‌ను కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కామారెడ్డి ఆసుపత్రిలో ప్రదీప్ యాదవ్ ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య

కామారెడ్డి క్రైం : అనారోగ్య కారణాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డిలోని ఎస్సీ వాడలో బుధవారం వెలుగు చూసింది. కాలనీకి చెందిన సంగి శ్రీకాంత్ గతంలో హైదరాబాదులో పనిచేసేవాడు. అక్కడ మిత్రబిందు (32)అనే మహిళను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. అప్పటినుంచి వారు కామారెడ్డిలో నివాసం ఉంటున్నారు. కొద్ది రోజులుగా మిత్రబిందు కడుపు నొప్పితో బాధపడుతుంది. అంతేకాకుండా వారికి ఎనిమిదేళ్లు గడిచినా పిల్లలు కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఈనెల 8న రాత్రి 9 గంటల ప్రాంతంలో ఎలుకల ముందు సేవించింది. ఆమెను మొదట కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి, అనంతరం నిజామాబాద్ జీజీహెచ్‌కు అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మిత్రబిందు మృతి చెందిందని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పోటీ పరీక్షల పుస్తకాల వివరాలివ్వండి



తెయూ(డిచ్‌పల్లి) : విద్యార్థులు సిద్ధమవుతున్న పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాల వివరాలను ఇవ్వాలని తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి వర్సిటీ లైబ్రేరియన్ సత్యనారాయణను ఆదేశించారు. బుధవారం క్యాంపస్‌లోని సెంట్రల్ లైబ్రరీని రిజిస్ట్రార్ సందర్శించారు. లైబ్రరీలో అందుబాటులో ఉన్న పోటీ పరీక్షల పుస్తకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా కావాల్సిన కొత్త పుస్తకాల కొనుగోలుకు సంబంధించి ఇండెంట్‌ను వెంటనే తయారు చేయాలన్నారు. వీలైనంత త్వరగా పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని లైబ్రేరియన్‌ను ఆదేశించారు. ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ క్యాంపస్‌లోని సెంట్రల్ లైబ్రరీ వసతులు, అవసరమైన పుస్తకాల గురించి చర్చించారన్నారు. రిజిస్ట్రార్ వెంట చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ వివేక్‌రాజ్, విద్యార్థి నాయకులు తదితరులున్నారు.

'దళిత బంధు' బీఆర్ఎస్ కార్యకర్తలకేనా?



వినతి పత్రం అందజేస్తున్న కోనాపూర్ దళితులు

కామారెడ్డి క్రైం/బీబీపేట: బీబీపేట మండలం కోనాపూర్‌లో దళిత బంధు పథకం అర్హులకు కాకుండా అనర్హులకు అందిస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం కామారెడ్డి కలెక్టరేట్‌కు దళితులు తరలివచ్చి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలో పేదలకు కాకుండా అధికార పార్టీ నాయకుల అనుచరులకు కేటాయిస్తూ అందిన కాడికి పంచుకుంటున్నారని వారు ఆరోపించారు. అందరికీ ఇవ్వాలని కోరారు. కోనాపూర్‌లో 12 మందికి దళిత బంధు పథకం మంజూరుకాగా అందులో సర్పంచ్ కుటుంబంలోనే ముగ్గురు పేర్లపై దళిత బంధు పథకంలో పేర్లు రాసుకున్నార ని మిగితా వాళ్ల పేర్లు కూడా బీఆర్ఎస్ కార్యకర్తలే ఉన్నారన్నారు. ప్రభుత్వానికి నిజంగా దళితులపై ప్రేమ ఉంటే గ్రామ సభల ద్వారా దళిత బంధుకు అర్హులకు ఎంపిక చేసి వారికి అందజేయాలని కోరారు.

'వ్యవసాయ గణన వేగవంతం చేయాలి'



మాట్లాడుతున్న అధికారి భాగ్యలక్ష్మి

బిచ్కుంద(జుక్కల్): వ్యవసాయ గణన కార్యక్రమంలో అధికారులు వేగం పెంచాలని, నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం బిచ్కుందలో మద్నూర్, జుక్కల్, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, డోంగ్లిం మండలాల వ్యవసాయ అధికారులు, ఏఈవోలతో సమావేశం నిర్వహించారు. ఎంత వరకు వ్యవసాయ గణన జరిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ఈ నెల 20 వరకు గణన కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు. గణనపై ఏఈవోలకు ఎలాంటి సందేహాలున్నా ఏడీఏ, ఏవోలతో మాట్లాడి సమస్య పరిష్కరించుకొని గణన పూర్తి చేయాలన్నారు. చీఫ్ ప్లానింగ్ అధికారి రాజారాం, డిప్యూటీ ఎస్‌వో లక్ష్మణ్, ఏడీఏ నూతన్ కుమార్, ఏవో పోచయ్య పాల్గొన్నారు.

విడిపోయిన దంపతులను కలిపిన ఐకేపీ సిబ్బంది



విడిపోయిన భార్యాభర్తలను కలుపుతున్న ఐకేపీ సిబ్బంది, మహిళ సమాఖ్య ప్రతినిధులు

భిక్కనూరు: మండల కేంద్రంలో మనస్పర్థలతో విడివిడిగా ఉంటున్న దంపతులను ఐకేపీ సిబ్బంది కలిపారు. వివరాలిలా ఉన్నాయి. 19 ఏళ్ల క్రితం మండల కేంద్రానికి చెందిన బాసం యాదగిరి, కాచాపూర్ గ్రామానికి చెందిన లత వివాహం చేసుకున్నారు. వీరికి బీటెక్ చదువుతున్న కుమారుడు, తొమ్మిదో తరగతి చదువుతున్న కూతురు ఉన్నారు. దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో ఆరేళ్లుగా విడివిడిగా ఉంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఐకేపీ సిబ్బంది, మహిళా సమాఖ్య ప్రతినిధులు బుధవారం ఇద్దరిని మహిళా సమాఖ్య కార్యాలయానికి పిలిపించారు. ఇరువురి వాదనలు విన్న అనంతరం ఇద్దరినీ సముదాయించారు. పిల్లల భవిష్యత్ కోసం దంపతులు తిరిగి ఒక్కటయ్యారు. కార్యక్రమంలో ఐకేపీ డీపీఎం రమేశ్‌బాబు, ఏపీఎం శ్రీనివాస్, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన మర్రి చెట్టు

- గంట పాటు ట్రాఫిక్ జామ్



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రం శివారులో ప్రధాన రహదారిపైన బుధవారం మర్రి వృక్షం కూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. చెట్టు ప్రధాన రహదారిపై కూలడంతో నిజాంసాగర్– ఎల్లారెడ్డి రోడ్డు మార్గంలో గంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఏఎస్సై రాజేశ్వర్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రొక్లెయినా సాయంతో రోడ్డుపై ఉన్న చెట్టును, కొమ్మలను తొలగించి మార్గం సుగమం చేశారు.

ఎల్సీడీసీ సర్వే ప్రారంభం

నిజామాబాద్ నాగారం : దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి సుదర్శన్ తెలిపారు. బుధవారం నగరంలోని ప్రత్యేకంగా దుబ్బ ప్రాంతంలో ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఇంటింటికీ సర్వే ద్వారా ప్రతి గ్రామం, ప్రతి పట్టణంలో ఉంటుందన్నారు. అలాగే వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తల ద్వారా కొనసాగుతున్న ఇంటింటి సర్వేను తనిఖీ చేస్తున్నామన్నారు. అనుమానిత కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమం 16వ తేదీ నుంచి ఈ నెల 31వ తేదీ వరకు మొత్తం 14 పని దినాల్లో నిర్వహిస్తామన్నారు. సర్వే ద్వారా గుర్తించిన కుష్టి వ్యాధిగ్రస్తులు అందరికీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి, చికిత్స అందిస్తామన్నారు. నిజామాబాద్ డివిజన్ ఉప వైద్యాధికారిని డాక్టర్ సరిత, సీహెచ్‌వో శశికళ, మధుకర్, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలున్నారు.

రేపు అథ్లెటిక్స్‌లో ఎంపికలు

నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న జిల్లా కేంద్రంలోని నాగారంలోని రాజారాం స్టేడియంలో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కా ర్యదర్శులు నరాల రత్నాకర్, రాజాగౌడ్ బుధవా రం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో అండర్ – 14, 16, 18, 20, స్త్రీ, పురుషుల విభాగాల్లో క్రీడాకారులకు 600 మీటర్లు, 800, 1500 మీటర్లు, 3,000 మీటర్లలో పోటీలు ఉంటాయన్నారు. ఎంపికైన క్రీడాకారులని ఈనెల 20న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. క్రీడాకారులు రూ. 100 ఎంట్రీఫీతో రిజిస్ట్రేషన్ చేసుకోగలరు. వివరాలకు 99890 40776లో సంప్రదించాలన్నారు.

వసతి గృహాల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఎంపిక పోటీలు

కామారెడ్డి అర్బన్: తెలంగాణ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన ఖమ్మం, హనుమకొండ అథ్లెటిక్స్ అకాడమీ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న 15 సీట్ల భర్తీకి గురు, శుక్రవారాలలో ఎంపిక పోటీలు నిర్వహిస్తారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ బుధవారం తెలిపారు. పదేళ్లలోపు క్రీడాకారులకు హనుమకొండ జేఎన్ స్టేడియంలో, 16 ఏళ్లలోపువారికి ఖమ్మం సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు పుట్టిన తేదీ సర్టిఫికెట్, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో సాధించిన ప్రశంసాపత్రాలు, ఆధార్‌కార్డు, మూడు ఫొటోలు తీసుకువెళ్లాలన్నారు. ఇతర వివరాలకు 94943 93609 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్రైం కార్నర్

అయ్యప్ప దర్శనానికి వెళ్తూ యువకుడి మృతి



గుండు సాయిరెడ్డి(ఫైల్)

బాల్కొండ : బాల్కొండ మండలం జలాల్‌పూర్‌కు చెందిన గుండు సాయిరెడ్డి(39) అయ్యప్ప దర్శనానికి వెళ్తూ బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జలాల్‌పూర్ గ్రామానికి చెందిన 12 మంది అయ్యప్ప భక్తులు బస్సులో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వరకు వెళ్లారు. మార్గమధ్యలో తూప్రాన్ వద్ద అల్పాహారం చేసిన తర్వాత ఆ సాయరెడ్డి వాంతులు చేసుకున్నాడు. చెమటలు ఎక్కువగా రాగా గ్యాస్ సమస్య అంటూ సాయిరెడ్డి కొట్టిపారేశాడు. అనంతరం రైలులో వెళ్తుండగా తీవ్రమైన గుండెపోటు రావడంతో ఆయన తమ్ముడు లక్ష్మణ్ ఆయన బావకు సమాచారమిచ్చాడు. దీంతో చర్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద రైలు ఆపి 108లో యశోద ఆస్పత్రికి తరలిస్తుండగా మాట్లాడుతూనే ఉన్న సాయరెడ్డి ఒక్కసారి దీర్ఘమైన శ్వాస తీసి ప్రాణాలు వదిలాడు. ప్రతి ఏటా శ్రావణమాసంలో అందరికీ శబరి టికెట్లు బుక్ చేసే వ్యక్తి దైవ దర్శనానికి వెళ్తూనే మృతి చెందడంతో తోటి భక్తులు ఆవేదన చెందారు. మృతుడికి భార్య,ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని..



అంకం నేహశ్రీ (ఫైల్)

రాజంపేట : అనారోగ్యంతో విద్యార్థిని మృతి చెందిన సంఘటన రాజంపేట మండలం ఆరెపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన అంకం శ్యాంకరావ్, భారతి కూతురు నేహశ్రీ(19) బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్ ఫస్టియర్ చదువుతోంది. అనారోగ్య కారణంగా ఇటీవల ఇంటికి వచ్చింది. తెల్లపసిరికలని వైద్యులు తెలపడంతో కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆమె తల్లిదండ్రులు చికిత్స అందించారు. పరిస్థితి విషమించగా మెరుగైన చికిత్స కోసం నేహశ్రీని మంగళవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి తమ్ముడు, చెల్లె ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఖలీల్‌వాడి : నగరంలోని మూడోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సల్తార్ రవి మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సల్తార్ రవి భార్య గోదావరి మధ్య తరుచూ గొడవలు జరిగేవన్నారు. బుధవారం ఉదయం భార్యాభర్తలకు గొడవ జరిగి భార్య పుట్టింటికీ వెళ్లగా మద్యంలో పురుగుల మందు తాగి ఇంట్లో పడిపోయాడు. స్థానికులు గమనించి అతడిని జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

బైక్ చోరీ కేసులో వ్యక్తి రిమాండ్

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణంలో బైక్ చోరీ చేసిన వ్యక్తిని పట్టుకుని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన కిరణ్ గతనెల 31న డైలీ మార్కెట్‌లో బైక్ నిలుపగా కొద్దిసేపటికి బైక్ చోరీకి గురైంది. వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. బుధవారం ఎల్లారెడ్డిలో వాహనాల తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి బైక్‌పై పారిపోతున్న కుర్మ రాజశేఖర్‌ను(26)ను ప్రశ్నించగా బైక్ చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడన్నారు. రాజశేఖర్ వద్ద నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు కేసుల్లో ముగ్గురికి..

లింగంపేట(ఎల్లారెడ్డి) : వేర్వేరు కేసుల్లో ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. బుధవారం మండలంలోని ఎక్కపల్లి గ్రామానికి చెందిన దూషన్నగారి శివకుమార్, అదే గ్రామానికి చెందిన శంకరి రామకృష్ణను ఎక్కపల్లి శివారులో అక్రమంగా అటవీ భూమిలో చెట్లు, పొదలు నరికివేసి భూమిని సాగుచేయడానికి ప్రయత్నించినట్లు తెలిపారు. అలాగే పోలీసు వాహనాలను ధ్వంసం చేసిన సంఘటనలో వీరిని రిమాండు చేసినట్లు ఎస్సై తెలిపారు. మరో కేసులో శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన బిట్ల ప్రశాంత్ ఎయిర్‌గన్‌తో అదే గ్రామానికి చెందిన బోధనపు రాజుపై కాల్పులు జరిపినట్లు తెలిపారు. గాయపడిన రాజు హైదరాబాదులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. రాజు ప్రాణాపాయం నుంచి బయటపడ్డట్లు ఎస్సై తెలిపారు. ఈ సంఘటనలో ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కలుషిత ఆహారం తిని మూడు గేదెల మృతి



మృతి చెందిన గేదె

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి పట్టణంలోని గుమస్తా కాలనీ సమీపంలో కొంతమంది వ్యక్తులు పారబోసిన కలుషిత ఆహారం తిని మూడు గేదెలు మృతి చెందినట్లు రైతులు తెలిపారు. అడ్లూరు గ్రామానికి చెందిన గడ్డమీది సంజీవ్, ముదాం మహేష్, పెరుమాండ్ల లింగంకు చెందిన మూడు పశువులు రోజు మాదిరిగా మేతకు వెళ్లాయి. శాబ్దిపూర్ రోడ్డు సమీపంలోని బైపాస్ రోడ్డు పక్కన ఉన్న వెంచర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు తమ లారీలో మిగిలిపోయిన యూరియా, బియ్యం వ్యర్థాలు పారబోయడంతో వాటిని తిన్న గేదెల్లో రెండు అక్కడికక్కడే మృతి చెందగా ఒక గేదె చికిత్స పొందుతూ మృతి చెందింది. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం జరిగినట్లు వారు పేర్కొన్నారు.

యువకుడిపై కేసు నమోదు

మోపాల్(నిజామాబాద్ రూరల్) : మండలంలోని ముదక్‌పల్లికి చెందిన నీరడి రాణిని పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్న నవీపేట్ మండలం మహంతంకు చెందిన దినేశ్‌పై కేసు నమోదైనట్లు ఎస్సై రాము బుధవారం తెలిపారు. రాణి నర్సింగ్ కళాశాలలో చదువుతుంది. ఇరువురు వరుసకు బావ మరదళ్లు. కొంతకాలంగా ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని రాణిపై ఒత్తి డి చేస్తున్నాడు. ఈక్రమంలో 14న ముదక్ పల్లిలో ఆ మె ఇంటి వద్ద గొడవ చేశాడు. రాణి, దినేష్ పురుగు ల మందు తాగినట్లు తెలిసింది. ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళ ఆత్మహత్య

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రానికి చెందిన బర్ల సునీత(35) బుధవారం ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై మురళి తెలిపారు. జుక్కల్ మండలం మహ్మదాబాద్‌లో గ్రామానికి చెందిన బోయి గణేశ్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య నిత్యం చిన్నచిన్న గొడవలు జరుగుతుండగా మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఇంటికి వెళ్లి పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



దోమకొండలో పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

దోమకొండ : మండల కేంద్రానికి చెందిన వాసవి రైస్‌మిల్‌లో బుధవారం దాడులు నిర్వహించి 8.80 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై మురళి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి దాడులు చేశామన్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం పట్టుకుని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పగించామన్నారు. సదరు రైస్‌మిల్ యజమాని ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. రైస్‌మిల్లుల్లో అక్రమంగా పీడీఎస్ బియ్యం అమ్మితే అలాంటి వారి సమాచారం పోలీసులకు అందించాలని, వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.